# సుశీల

## చలం

'సుశీల' కథ 1924లో 'సాహితి'లో తొలిసారిగా అచ్చయినట్టు చలం సాహిత్యం మీద పరిశోధన చేసిన వావిలాల సుబ్బారావుగారు తన పరిశోధన గ్రంథంలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ వారు మధురాంతకం రాజారాం గారి సంపాదకత్వాన దాదాపు పాతికేళ్ళ క్రిందట వెలువరించిన 'తొలినాటి తెలుగు కథ' అన్న సంపుటిలో మొట్టమొదట నేను ఆ కథను చదివాను. స్వాతంత్ర్య పోరాటాన్ని ఘనంగా శ్లాఘించి, ఆ పోరాటంలో తమ సర్వస్వాన్ని ధారపోస్తున్న కార్యకర్త - నారాయణప్ప త్యాగాన్ని హృదయానికి హత్తుకునేటట్లు చిత్రించిన ఈ కథలో ఆనాటి చారిత్రక దశలో రాజకీయ సామాజిక జీవితాన్ని చలం ఎంతో ప్రతిభావంతంగా కథా చట్రంలో సాహిత్యబద్ధం చేయటం ఆసక్తి కల్గిస్తుంది.

తెలుగులో స్వాతంత్ర్య పోరాట నేపథ్యంతో రాసిన కథలు చాలా తక్కువ. అట్లాంటి కథలు వేసుకోవటంలో పత్రికలకున్న ఇబ్బందులు, అవి రాసే రచయితలకున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుంటే ఆ కథలు తక్కువగా రావటానికి కారణాలు అర్థమవుతాయి. ఆ కోవకు చెందిన కథ కావటం వల్ల 'సుశీల'కు తెలుగుకథా సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానం ఏర్పడింది. స్వాతంత్ర్యపోరాటం నేపథ్యంతో వచ్చిన తొలికథ కూడా 'సుశీల' కావచ్చు. చలం గారి 'అప్పుడు - ఇప్పుడు' 'ప్రేమకు పర్యవసానం' ఈ పోరాట నేపథ్యంలో రాసిన కథలే.

ఒక ఉద్యమం యొక్క స్వరూపం ఆ ఉద్యమ లక్ష్యాల ఔన్నత్య ఔచిత్యాల మీద మాత్రమే కాకుండా ఆ ఉద్యమ నాయకత్వం మీద, అందులో పని చేసే కార్యకర్తల వ్యక్తిత్వాలమీద, వారి సంకల్పం, కార్యదీక్ష,చిత్తశుద్ధి, త్యాగనిరతి వంటి ఆదర్శ గుణగణాలమీద కూడా ఆధారపడివుంటుంది. అట్లాంటి అంకిత భావమున్న కార్యకర్త నారాయణప్ప. ఆనాటి సంస్కార ఉద్యమానికి - తదనంతరం స్వాతంత్ర్య పోరాట ఉద్యమానికి ప్రతినిధి నారాయణప్ప. వలసపాలకుల పాలనా యంత్రాంగానికి ప్రతినిధి పోలీస్ సూపరింటెండెంట్ సులేమాన్. సంస్కార ఉద్యమ కుటుంబాలలో స్త్రీలకు నారాయణప్ప భార్య సుశీల ప్రతినిధి. కథలో ఇవి మూడే పాత్రలు. మూడు విభిన్నమైన దృక్పథాలకు సంకేతాలు. దేశంలో వలసపాలనకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాట ఉద్యమాలకీ, ఆ ఉద్యమంలో పాల్గొంటున్న వ్యక్తుల ఆదర్శాలకీ వారి కుటుంబ సభ్యుల అనుబంధాలకీ, ఆకర్షణలకీ, జీవితానికీ, ఆచరణకీ మధ్య బహుముఖమైన సంఘర్షణ ఈ కథలో ఇతివృత్తం.

'ఆ కాలంలో న్యూసు పేపర్లు చాలా హడావిడి చేస్తూ వుండేవి. సత్యాగ్రహం, రౌలట్ ఆక్టు, రౌలట్ చట్టం: 18.3.1919 భారత దేశంలో విప్లవ జాతీయ ఉద్యమాన్ని అణచివేసేందుకు బ్రిటిష్ ప్రభుత్వానికి విస్తృతమైన అధికారాలను కల్పించే ఉద్దేశ్యంతో చేశారు. జస్టిస్ సిడ్నీ రౌలట్ అధ్యక్షతన రాజద్రోహ విషయాలు ఈ శిఫారసులు చేయటం మూలంగా చట్టానికి రౌలట్ పేరు వచ్చింది. ప్రజల రాజకీయ కార్యకలాపాల హక్కులను కాలరాచి అణచివేయటానికి ఉద్దేశించిన ఈ నిరంకుశ చట్టాన్ని ప్రజలు ప్రతిఘటించాలని గాంధీ దేశ వ్యాప్తంగా పర్యటించి ప్రజలకు ఉద్బోధించినారు.

ఇవన్నీ అయిపోయి, పంజాబ్ వధల కాలం, జలియన్ వాలాబాగ్ హత్యాకాండ 13.4.1919 వొస్తోంది. దేశమంతా అల్లకల్లోల మయ్యేట్టు కనబడుతోంది' అని రచయిత చెప్పడం కథ చారిత్రక భూమికను నిర్ధారించటానికే.

'ఇవన్నీ జరుగుతుండగా ఈ లోపల నాన్‌కోపరేషన్, నాన్‌కోపరేషన్ 1920 చాలా యెక్కువయింది. విద్యార్థుల బళ్ళు మానేస్తున్నారు. ప్లీడర్లు కోర్టులకు, వెళ్ళడంలేదు. వార్తాపత్రికలు వుద్యమం దినదినమూ బలమవుతున్న సంగతి చాటుతున్నాయి. ఎవరికి చేత అయినట్లు వారు త్యాగం చేస్తున్నారు. ప్రతివారి హృదయాలలోనూ దేశభక్తి అంకురిస్తోంది. ధనం యిచ్చేవారు, సొమ్ములు యిచ్చేవారు, కాలమిచ్చేవారు, శక్తినిచ్చేవారు, సౌఖ్యాన్నిచ్చేవారు - ఎవరికి చేత అయింది వారు అర్పించుకుంటున్నారు. ఏమౌతుందా అని ప్రతివారూ ఎదురుచూడ్డమే. 31వ డిశంబరులో ఏదో గొప్ప మార్పు జరగబోతుందని ఆబాలగోపాలం నమ్మేశారు. అందులో ఆ వూళ్ళో ముఖ్యంగా ఆ హడావిడి చాలా ఎక్కువగా వుంది. భజనలు, కీర్తనలు, మీటింగులు, ప్రొఫెషన్‌లు, లెక్చర్లు, సమ్మెకట్లు, హరతాళాలు ఎగిరిపోతున్నాయి'

ఇదీ వాతావరణం

'వీటికంతా నాయకుడు నారాయణప్పగారు'

ఆనాటి సంస్కార ఉద్యమాలకి నాయకత్వం వహించిన విద్యావంతులైన సంపన్న బ్రాహ్మణ వర్గలే, తెలుగుదేశంలో స్వాతంత్ర్య పోరాటంలో కూడా ముందడుగువేశాయి. నారాయణప్ప మూలం అదే. తన క్రమ పరిణామంలో నారాయణప్ప స్వాతంత్ర్యోద్యమంలో మమేకమైనాడు. ఆచరణశీలుడైన సంస్కార కుటుంబాలలో ముఖ్యంగా భార్యకు ఉన్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాల సంస్కారం మూలంగా, స్వీయ వ్యక్తిత్వం రూపుదిద్దుకున్న సుశీల, ఆ వూరుకు కొత్తగా వచ్చిన పోలీస్ సూపరింటెండెంట్ సులేమాన్ ఆకర్షణలో నించే మునిగి పోతుంది. అక్కడే మొదలవుతుంది అంతః సంఘర్షణ.

ఒక మహోద్యమం దేశం నలుమూలలా దావానలంలా సాగుతున్నపుడు ఉద్యమంలో సాగుతున్న వ్యక్తుల మీద ఉద్యమం చూపించే ప్రభావం, వ్యక్తిగతమైన అనుబంధాలలో, కుటుంబ సంబంధాలలో అది సృష్టించే సంక్షోభం, ఆ సంఘర్షణల్లో చిక్కుకున్న మనుషులపై అది వేసే ముద్ర మామూలు మనుషులు సైతం ఎట్లా తమ స్వంత లాభాలని, స్వంత ప్రయోజనాలనీ, వాయిదా వేసుకోవలసి వస్తుందో,

క్రమంగా వాటి అల్పత్వం అర్థమై దూరం చేసుకోవలసివస్తుందో, ఉద్యమ మహోన్నత ఆదర్శాల ప్రభావంతో ఉక్కిరిబిక్కిరైన వాళ్ళకు స్వీయ ఆకర్షణల క్షణికావేశాల నిరర్థకత బోధపడి అవి ఎట్లా తుడుచుకు పోతాయో, ఉద్యమ స్ఫూర్తి ఆవహించిన కొత్తబాటలు కొత్త వ్యక్తిత్వం ఎట్లా వికసిస్తుందో సుశీలలో మనకు సాక్షాత్కారమవుతుంది.

పూర్వం యుద్ధాలు చేసే యోధులు జ్ఞాపకమొస్తున్నారు. నిన్ను చూస్తే అని ఒకప్పుడు ప్రేమోన్మత్తతతో పొగిడిన సులేమాన్‌ని ఇప్పుడు, నిర్విరామంగా ఈ ఉద్యమంలో కార్యకర్తగా కొనసాగిన అనుభవం తర్వాత-

'దేశంలో వుద్యమం పోతే పోవచ్చుకాని నా హృదయంలోంచి పోదు. దానిలో నా వూహలు, నా బతుకు, నా వాంఛలు అన్నీ మారిపోయాయి. ఇదివరకటి మనిషిని కాను. ఈ వుద్యమం, ఈ త్యాగం అంతా వృథా కావచ్చు. దేశంలో యేమీ వుపయోగం లేకపోవచ్చు. కానీ ఒక జీవితానికున్న గొప్ప వుపకారం జేసింది. కొత్త ఆదర్శాన్నీ, ఆనందాన్నీ, ఆసక్తినీ యిచ్చింది. నిజం చెబుతున్నా ఏమనుకోకే. నీ మీద ఎన్నటికీ పోని ప్రేమ వుంది నాకు . నన్ను మింగేస్తున్న ప్రేమ. అంతేకాని యిదివరకువలె నీ హోదా, నీ వుద్యోగం చూస్తే నాకేమీ గౌరవం లేదు. ఇప్పుడు నా అభిప్రాయం అదంతా తిండికోసం బానిసత్వమని. ఆ యూనిఫారం చూస్తే నాకు పంజాబూవధలూ, నిరాయుధుల్ని కాల్చడం జ్ఞాపకమొస్తాయి.' అంటుంది సుశీల.

ఉద్యమం సుశీల జీవితంలో తెచ్చిన మార్పులో, విద్యతో, ఆమె అవగాహన ఎంత విప్లవాత్మకమైన ఆత్మపరిశీలనకు దారితీసిందో తెలుస్తుంది. ఉద్యమాలు సాగుతున్న ప్రతిసందర్భంలోనూ సుశీల మాటలు పదేపదే ధ్వనిస్తాయి. భావస్వాతంత్ర్యపోరాటంలో సాహిత్యం కాగాడాపట్టుకున్న చలం అందించిన అద్భుతమైన కథ 'సుశీల.'

--శ్రీపతి

## నాకు నచ్చిన కథ

# సుశీల

చలం


నారాయణప్పగారిది కొత్తపద్ధతుల ఇల్లు. బ్రాహ్మలే. అయినా ఇల్లు పైనించి చూడడానికి యూరోపియనుల ఇల్లు లాగుంటుంది. వరండాకి ముందు తడికలూ, తొట్లలో మొక్కలూ, గోడలికి సీనరీల పటాలూ, పట్టుసోఫాలూ, పేము కుర్చీలూ, గాజుగిన్నెల్లో పువ్వులూ అన్నీ చాల అందంగా వుంటాయి. మనుషులూ అట్లానే వుంటారు. ఆయన బూట్సులూ, షర్టులూ, బొత్తాములూ, కోట్లూ, క్రాపింగు జుట్టూ అన్నీ నీటుగా వుంటాయి. ఆయన భార్యా అట్లానే సన్నగా, పొడుగ్గా, చాలా నాజూకుగా వుంటుంది. ఆ జుట్టు దువ్వుకోవడం, బొట్టు పెట్టుకోవడం, చీర కట్టుకోడం, నడవడం, నవ్వడం మాట్లాడడం అన్నీ నాజూకుగా, అందంగా వుంటాయి.

తెల్లవారి లేవగానే చూసినా సరే అట్లానే వుంటుంది. ఒక్క వెంట్రిక తల నించి రేగి వుండదు. తల్లో వొక్కపువ్వు నలిగి వుండదు. ఆమె జాకెట్టూ, చీరా, బెల్టూ, చేతికి సన్నని గాజులూ, మెళ్లో సన్నని గడియారం గొలుసూ, కాళ్ళకి మొహమలు స్లిప్పర్లూ అన్నీ సృష్టిలోనే ఆమె కోసం ఏర్పడ్డట్టుంటాయి. ఆమె పేరు సుశీల. వాళ్ళ వంటవాడూ అంతే, అంత శుభ్రంగా గవర్నరుగారి బొట్లరుకూడా వుండడు. ఆయన కుక్కలూ అంతే. తక్కిన కుక్కలవలె అల్లరి చెయ్యవు. అనవసరంగా మొరగవు, బయటికి వెళ్ళవు, వాటి ముక్కుదగ్గర బిస్కట్లు తింటున్నా అడగవు. కాళ్ళు మీద పెట్టవు. నాకమంటేనే గాని చెయ్యిగానీ, మూతిగానీ నాకవు. ఆయనకి పిల్లలులేరు గాని, వున్నా వాళ్ళు అల్లరి చెయ్యరు. యెత్తుకోమనరు. ప్రాణం విసిగేట్టు ప్రశ్నలు వెయ్యరు. తేలు కుట్టినా బిగ్గరగా యేడవరు.

నారాయణప్పగారికి ఆస్థి చాలా వుంది. ఆర్జించుకునేందుకు ఆయన చాకిరీ చెయ్యనక్కర్లేదు. కాని ఎప్పుడూ కూడ సోమరిగా వుండడు. ఛైర్మనూ, ప్రెసిడెంటూ, సెక్రటరీ ఆనరరీ మెంబరూ మొదలయిన పనులు ఆయనకి ఒక డజన్ వున్నాయి. తీరుబడే వుండదు, సాయంత్రం తప్ప. సాయంత్రం వూళ్లో పెద్ద ఉద్యోగస్తులందరూ ఆయన ఇంటికి చేరుకుంటారు. ఈయన ఇల్లు ఒక క్లబ్బు. వొచ్చేవాళ్ళు లేక ఆ వూరి క్లబ్బు మూసేశారు. ఏ వుద్యోగస్తుడు ఆ వూరు కొత్తగా వొచ్చినా నారాయణప్పగారి స్నేహం కోరి, వెతికి ,చేసుకోంది ఒక్క గంట నిలవడు. వాళ్లందరూ ఆయన ఇంటికొస్తారు. టెన్నిసు ఆడతారు, టీ తాగుతారు, చీట్లాడుతారు, రాత్రి పదింటికి వెడతారు. సుశీలగూడా వాళ్ళందరితో కలిసి ఇంట్లో తిరుగుతుంది. వాళ్ళకి షేకాండిస్తుంది. టీ ఇస్తుంది. న్యూస్ పేపరు సంగతులు చర్చిస్తుంది. వాళ్ళతో కూచుని వుంటుంది వాళ్ళు వెళ్ళిందాకా.

ఆ కాలంలో న్యూసుపేపర్లు చాలా హడావిడి చేస్తో వుండేవి. సత్యాగ్రహం, రౌలెట్ ఆక్టు. ఇవన్నీ అయిపోయి, పంజాబు వధలకాలం వొస్తోంది. దేశమంతా అల్లకల్లోలమయేట్టు కనపడుతోంది. ఇదంతా సుశీ


CHAITANYA




లకి చాలా సరదా. వీళ్ళందరూ ఏమంటారో తెలుసుకోడం ఆమెకి చాలా ఇష్టం. నారాయణప్పగారు యీ గవర్నమెంటు ఉద్యోగస్తులనేగాక వూళ్ళో అందరిని యెరుగును. వీళ్ళ వుద్దేశాలేగాక లోకమంతటి వుద్దేశాల సంగతి తెలుసు అతనికి. అందుకనే అతనికీ, వుద్యోగస్తులకీ చాలా పెద్దవాదనలు జరిగేవి. కాని సుశీల వూహలు చాలమట్టుకి గవర్నమెంటు వుద్యోగస్తుల వల్ల ఏర్పడ్డవే! ఆమె స్త్రీ గనక వూళ్ళో తిరగదు. విశాలమైన దృష్టిలేదు.

నారాయణప్పగారికీ, సుశీలకి మతం, కులం పట్టింపులు లేవు. మీరెవరంటే' బ్రాహ్మలమంటారు గాని, ఆ బ్రాహ్మణీకం యెక్కడుందో గుర్తుపట్టడం చాలా కష్టం. వాళ్ళ యింట్లో బ్రాహ్మర్లీ, తురకర్లీ, క్రిష్టియన్లనీ, ఒక మోస్తరుగానే చూస్తారు. కష్టమయినవాళ్ళు రావడం మానెయ్యవచ్చు. వాళ్ళకి లక్ష్యంలేదు. ఇట్లా వున్నా వూళ్ళో యెవరూ వాళ్ళని హీనంగా చూడరు. వాళ్ళని భోజనానికి పిలుస్తారు. వాళ్ళింటికి వెడతారు. ఆయన పిలిస్తే చాలు ప్రతివారికీ గొప్పే! నారాయణప్పగారికున్న పలుకుబడీ, మర్యాదా యెవరికీ లేవు. కాని వీపు వెనకాల గుసగుసలు యెవరికి తప్పుతాయి యెంత గొప్పవాళ్లయినా, మంచివాళ్ళయినా?

సుశీలకీ నారాయణప్పగారికీ చాలా ప్రేమ వొకరిమీద వొకరికి. ఎన్నడూ వొకరితో వొకరు పోట్లాడి యెరగరు. వొకరుచెపితే అది రెండోవారు ఆజ్ఞగా నెరవేరుస్తారు. నారాయణప్పగారు భార్య ఆత్మని చంపి, తనవశం చేసుకుని, తనకు నీడను చేసుకొని, తనవూహలే ఆమె తల్లో పెట్టి ఆమె నోట రప్పించి, మేమిద్దరం ఒకటయిపోయినామనే రకం మనిషికాడు. ఆమె వూహలకీ, పనులకీ పూర్ణస్వాతంత్రమున్నది. ఎన్నడూ వొకరిమీద వొకరికి అనుమానం లేదు. అనుమానపడడమనే తలపే వారికీ సిగ్గువేస్తుంది. ఇందరు మొగాళ్లు వొస్తో వుంటారు, పోతూ వుంటారు, నారాయణప్పగారు అనేకసార్లింటో వుండరు. అయినా అనుమానమన్నమాట లేదు.

కొత్తగా ఆవూరు ఒక తురక పోలీసు సూపరెండెంటు వొచ్చాడు. ఆయనపేరు సులేమాన్. చిన్నవాడు, అందమైనవాడు. అతనికి కొత్తగా పనికావడం యిక్కడికే. ఆయన యూనిఫారం, కత్తీ, పోలీసు ఉద్యోగస్తుల శాల్యూట్లూ చూసుకొని, ఆయనికి చాలా వినోదంగా, కొంచెం గర్వంగా వుండేది. ఆయనకి పెళ్ళికాలేదు. మొత్తానికి ఆయనతో ఆడవారెవరూ లేరు. ఆయన ఇంగ్లాండు వెళ్ళివచ్చాడు. ఆయన జాతి యేమిటో, మతమేమిటో నిర్ణయించడం కష్టం. సరే వొచ్చినరోజునే అతను నారాయణప్పగారి యింటికి వొచ్చాడు. ఆయన ఇంట్లో భార్యా, కుక్కలూ, ఆయనకి పట్టింపులు లేకపోవడం, ఆ సాయంత్రపు టీ, కబుర్లూ అన్నీ సులేమానికి చాలా సంతోషం, ఆశ్చర్యం కలగజేశాయి. ఇండియాలో కూడా ఇట్లాంటివాళ్ళుంటారనుకోలేదు. మొదటిరోజునించీ కూడా ఆయనకీ, సుశీలకీ చాలా స్నేహమయింది. వారం రోజుల్లో మరీ ఎక్కువయింది. అది అక్కడకొచ్చేవాళ్ళందరికీ కనపడుతూనే వుంది.

పది సంవత్సరాలు నారాయణప్పగారితో కాపరం చేసిన తరవాత సుశీలకి ఇప్పటికి యింకొక పురుషుడిమీద ప్రేమ కలిగింది. ఆమెకి యీ ప్రేమ ఏమీ ఇష్టంలేదు. నారాయణప్పగారంటే ఆమెకి యెక్కువైన గౌరవం కనక మొదట సుశీల ఈ ప్రేమతో చాలా పోట్లాడింది. ఒకటి రెండురోజులు వుత్త స్నేహమనుకుని సమాధానపరుచుకుంది. తరవాత తెలుసుకుని అతనికి దూరంగా వుండడానికి ప్రయత్నించింది. కాని సులేమాను వెతికి ఆమెను తీసుకొచ్చేవాడు. తరవాత ఆమె ఆ ప్రేమని నిలుపుకోలేక ఘోరమైన యుద్ధంచేసింది. కాని ప్రేమ చాలా మాధుర్యంగా వుంది. ఆమెకి భర్తమీద భక్తిగానీ, పాపభీతిగానీ ఏమీలేవు. అదంతా మూఢత్వమని ఆమె నమ్మకం. భర్త లేకపోతే అసలు ఈ సందేహాలే ఆమెకి వుండేవి కావు. ఈ యుద్ధమే అవసరంలేదు. తన భర్తకియ్యవలసిన ప్రేమ ఇతనికిస్తున్నానని ఆమెకి చాలా బాధగా వుంది. నారాయణప్పగారితో చెప్పాలని నిశ్చయించుకొంది. ఆయన్ని చూస్తే భయంలేదు. కాని ఆయనకి మనోవేదన కలుగుతుందనీ, తరవాత ఆయన ఎట్లానన్నా తననీ సులేమాన్ స్నేహం మాన్పిస్తాడనీ భయంవేసి వూరుకుంది. ప్రేమ జయం పొందింది. భర్తమీద ఇప్పటికీ ప్రేమవుంది. అయినా ఈ కొత్త ప్రేమ ఆమెని పూర్తిగా స్వాధీనం చేసుకుంది.

కొందరు స్త్రీలు వారినెవరికి పెళ్ళిచేస్తే వారిని వెంటనే ప్రేమిస్తారు. ప్రేమించినట్టే వుంటారు. ప్రేమించామనే వారూ అనుకుంటారు. దాంట్లో యేమీ మోసం లేదు. చాల నమ్మకస్తులు. కాని యెప్పుడో వొకప్పుడు, యెవరో కొత్తవారిమీద నిలపరాని ప్రేమ కలుగుతుంది వారికి. వారి హృదయాలు యెవరికోసం చెయ్యబడ్డాయో అటువంటి వారిని కలుసుకుంటారు. అపుడు ఆ మహాగ్నిలో ఈ పూర్వపు ప్రేమా, నీతీ, విశ్వాసమూ అన్నీ దగ్ధమవుతాయి. యెవరూ ఆపలేరు. కొన్ని బయటికి వస్తాయి. కొన్ని ఒకరిద్దరికి తెలిసి ఆగుతాయి. కొన్ని బైటికి రానేరావు యీ విషయాలు.

సులేమాన్ స్వభావమంతా పట్టుదలతో చెయ్యబడ్డది. తలుచుకున్నాడా అది నెరవేరి తీరాలి అందాకా నిద్రపోడు. పోలీసు సూపరెంటు కావాలని పదిహేనేళ్ళ కిందట చిన్న కుర్రవాడుగా వున్నప్పుడనుకున్నాడు. అయిందాకా వొక్కరోజు ఆ పట్టుని మరిచి వుండలేదు. సుశీలని చూసిన మొదటిరోజే ఆమెని ప్రేమించాననీ, తనదాన్ని చేసుకోవాలనీ అనుకున్నాడు. ఇంక అంతే. ఆమె ప్రేమని లోబర్చుకున్నదాకా నిద్రపోలేదు. యెవరడ్డమొచ్చినా, తనకెంత

నష్టమయినా, ఆ పనిని వొదలడు. ఈకాలంలో ఈ దేశంలో పుట్టాడుగాని హనిబాల్ వంటి దీక్షాపురుషుడు కావలసింది. ఆమె తనని ప్రేమిస్తోందా లేదా అని ప్రశ్నేలేదు. తప్పించుకోడానికి ఆమె ప్రయత్నాలూ, ఆమె భయమూ, పశ్చాత్తాపమూ, అన్నీ చూశాడు. తన బలంతో ఆమెని, అవన్నీ కూడా తోసేసి, తన దగ్గిరికి వచ్చేటట్టు చూశాడు. ఇంక ముందు వెనకలు లేవు. స్నేహితుణ్ణి మోసం చేస్తున్నాననే ఆలోచన తట్టింది. కాని దాన్ని పైకి రానీయడు. తలచుకున్నది చేసి తీరాలి. అతనికి ఇంకో కరు చూస్తారు. తనకవమానం, అల్లరి - ఇల్లాంటి ఆలోచనలు లేనేలేవు. యెవరన్నా అడిగితే సంగతంతా చెప్పేస్తాడు కూడాను.

ఒకనాటి రాత్రి పదింటికి వచ్చిన వాళ్ళందరూ తోట్లోంచి వెళ్ళిపోతున్నారు చీట్లాట చాలించి. నారాయణప్పగారు ఆ రాత్రి పన్నెండింటికిగాని రానన్నాడు, పని మీద వెళ్ళాడు. సులేమాను కదలలేదు. ఆఖరు మనిషి వెళ్ళడంతోటే సుశీలా, అతనూ మధ్య అడ్డం తీసేస్తే కలుసుకునే రెండు ప్రవాహాల్లగ కావిలించుకున్నారు. సన్నగా తెల్లగావున్న సుశీల రాతి విగ్రహంమల్లే నిలబడ్డ అతన్ని అల్లుకున్నట్లు కలిసిపోయింది. అతని షర్టుమీదా, భుజంమీదా ముద్దు పెట్టుకుంది. ఇంకా యెప్పటికీ వొదలకుండా అట్లా పుత్తరీయంపలె వుండిపోతుందేమో ననిపించింది. "పొద్దున్నించి ఎదురు చూస్తున్నాను. ఇంక వొదలను ఎన్నటికీ వదలను. ఇన్నాళ్ళూ, ఇన్ని సంవత్సరాలు, నాకు కనపడకుండా ఎక్కడున్నావు? నిన్నింక వదలను. ఎట్లా వెడతావో వెళ్ళు".... .....

రాత్రి వొంటిగంటయింది మంచంమీద సుశీల నిద్రపోతున్నట్లు పడుకుని వుంది. సన్నని దీపం వెలుగుతోంది. నారాయణప్పగారు పడుకోడానికి కోటూ అవీ తీసేస్తున్నారు. "సుశీలా!"

జవాబులేదు. వచ్చి మంచంమీద కూచుని సుశీలమీదికి వొంగి, మొహం తనకేసి ప్రేమతో తిప్పుకున్నాడు. చెంపలనిండా కన్నీళ్ళున్నాయి; ఎన్నడూ లేనిది జుట్టు చీదరగా చంపల కతుక్కుని వుంది. ఆయన చాలా ఆశ్చర్యపడ్డాడు

"సుశీలా, సుశీలా, ఏమిటి? ఈ కన్నీళ్ళేమిటి? ఎందుకేడ్చావు?"

ఆమెనంతా లాక్కుని తనవేపు తొడల మీద పడుకోపెట్టుకున్నాడు. సుశీల కళ్ళు విప్పింది. మళ్ళీ నీళ్లు కారుతున్నాయి.

"యేం లేదు; ఏదో దిగులేసింది."

నారాయణప్పగారికి వారంరోజుల నించి యేదో చెప్పలేని బాధగా వుంది. కారణం ఆలోచించినా తెలలేదు ఇప్పుడు సుశీలని చూడగానే ఈమె విషయమే ఈ బాధ అని తట్టింది.

"సుశీలా! ఏదో వుంది. నా దగ్గర్నించి దాస్తున్నావు."

"ఏం లేదు."

"నేను నమ్మను. దాస్తావా, నాతో చెప్పకుండా? చెప్పవూ? నేనేమీ అనని నీకు తెలీదూ? చెప్పు - నా సుశీలకదూ! ఛీ, ఏడుస్తారా? చెప్పెయ్యి. నేను ఆలోచిస్తాగా తరవాత ఏం చెయ్యాలో"

అంతా అతనితో చెప్పేసి శాంతి పొందాలని సుశీల కెంతో అనిపించింది. కాని చెప్పేస్తే .... తరవాత ... . తరవాత ఆ రాత్రి ఏమి చెప్పలేదు. సుశీల ఏదో మనోవ్యథలో వుందని నారాయణప్పగారికి తెలిసిపోయింది. తనకెందుకు చెప్పదో ఆయనకర్థంకాలేదు. తనే యెట్లాగన్నా తెలుసుకుని పోగొట్టాలని నిశ్చయించుకున్నాడు. ఏమీ అనుమానం మాత్రం మనసులో లేదు, ఆయనకి. ఇంతేకాకుండా సులేమానంటే కూడా అయిష్టం మొదలు పెట్టింది నిష్కారణంగా. అతను ఏమన్నా అంటే తను సహజంగానే దాన్ని కాదంటాడు. సుశీలా సులేమాన్ ఒకటే మాట - గవర్నమెంటు పక్షం, అతను ప్రజలపక్షం. సులేమాన్ని చూస్తే ఆయనకి ఒక విధమైన భయంకూడా పట్టుకుంది. ఆయన, కారణమైన భయం సంగతి తలుచుకుని నారాయణప్పగారు తనలో తను నవ్వుకునే వారు.

ఒకరోజు పొద్దున్న సుశీల పోలీసులైన్లకి వెడతానంది. ఆవాళ గొప్ప డ్రిల్లు జరుగుతుందని చూడ్డానికి సులేమాను రమ్మన్నాట్ట. సుశీల తనని యూనిఫారంలో చూడాలని అతని ఆశ.

నారాయణప్పగారు "యెందుకులెద్దూ, అందరి వుద్యోగస్తులలో నువ్వు ఆడదానివి వొక్కతెవూ వెళ్ళడం బాగుండద"న్నాడు.

"నేను వొస్తానని చెప్పాను. పాపం ఆయన యెదురు చూస్తో వుంటాడు" అంది.

"ఇప్పుడు నువ్వు వెళ్ళకపోతే అతని డ్రిల్లు ఆగుతుందా? పోనిద్దూ!" అన్నాడు.

"అట్లాకాదు వెడతాను. ఉండిపోవడానికి నాకేం కారణం కనపడ్డం లేదం"ది.

ఇద్దరికీ భేదాలు వొస్తున్నాయి.

సన్నని చీనా పట్టుచీరె కట్టుకుని, తల్లో గులాబిపువ్వులు పెట్టుకుని, గుర్రపుబండిలో వెళ్ళింది. ఇంకా సులేమాన్ బంగాళానించి బయలుదేరలేదు. కాఫీ తీసుకోబోతున్నాడు. యూనిఫారం వేసుకుని పెద్దకత్తి కిందకి వేళ్ళాడుకుంటో పెద్ద చేతులూ, ఆ బలిసిన మెడా, గుండ్రని దవడలూ, అతన్ని చూసింది.

"ఎంత బావున్నావు? ఈ డ్రెస్సులోనే ఏదో అందం వుంది. నాకు తప్ప యింకెవరికీ కనబడదు"

"నీకు కనపడాలనే నేను రమ్మన్నాను."

"అందరూ సోల్జర్లు కావాలని వుంటుంది నాకు. ఆ కత్తి, ఆ తుపాకీ, ఎంత మందిని చంపెయ్యొచ్చు? యెవరూ అడ్డం చెప్పలేరు కదూ? పూర్వం యుద్ధాలుచేసే యోధులు జ్ఞాపకమొస్తున్నారు నిన్ను చూస్తే! ధర్మం నిలబెట్టే మహారాజులాగున్నావు. అన్యాయం, నీచత్వం కత్తికి వొణకవలిసిందే!"

"ఏమిటి ఇవాళ కవివయినావు?"

"ప్రేమ మారుస్తుంది. సామాన్య మానవుల్ని దేవతలని చేస్తుంది"

"అవును. నేను యోధుణ్ణయితే. యోధుడికి జయమిచ్చే దేవతవి నువ్వు" అని మోకరించి ఆమె చెయ్యిని ముద్దుపెట్టుకున్నాడు.

"నా చెయ్యిని చెరుకు ముక్కలాగా నవిలెయ్యగలవనుకుంటా! ఆ దవడలతో! ఎక్కడిది నీకింతబలం?"

"చారూ, మజ్జిగా తాగితే బలం వొస్తుందా!"

"నేనుకూడా మీ అంత లావుగా వుంటే బావుండేదాన్ని?"

"వుండవు. నాకు సన్నని వాళ్ళని చూస్తే ఇష్టం. నా మెళ్లో హారాల్లా గుండాలి వాళ్ళ చేతులు, నన్ను కాగిలించుకుంటే! నా బలాన్నంతా ఆ బలహీనంతో, మృదుత్వంలో కట్టేయ్యాలి ..... నీకో?"

"నాకేమిష్టమో తెలీదాయేం నీకు? ఇట్లా వుంటే" అని అతని నడుంచుట్టూ చేతులు పోనిచ్చింది.

"ఈ బలమంతా, అధికారమంతా, పొగరంతా నాదేకదూ?"

"నీదే కాని యిది బలమేకాదు, నీ చేతుల్లో వోడిపోయే మా బలమేం బలం? ఏ తుపాకుల దెబ్బలన్నా తప్పుకుంటాముగాని యీ కళ్ళనించి .... యీ పెదిమెలనించి --- యీ మాధుర్యంనించి......"

సుశీల ఆరోజు ఇంటికి మధ్యాహ్నం మూడింటికి వచ్చింది. తరవాత త్వరలోనే నారాయణప్పగారికి అనుమానం తట్టడం మొదలుపెట్టింది. వాళ్ళ మొహాలే చెప్పాయి అతనికి. కాని అతను చూడ తలచుకోలా. అరితేరిన దొంగలూ, మొనగాళ్ళూ, తప్పు చేసి దాచుకోగలరు. కాని నిర్మల స్వభావులు దాచలేరు. అందులో సులేమాన్ దాచడానికికూడా ప్రయత్నించడు. ఒకరిద్దరు స్నేహితులు నారాయణప్పగారితో కొంచెంగా సూచించారు. అయినా ఆయనకి నిశ్చయంలేదు. సాధారణమైన భర్తలవలె దాక్కుని, దొంగవేషాలువేసి, వాళ్ళిద్దరినీ కలిపి ఏం చేస్తారో చూసి, సాధించే రకం కాదు! ఆయన మనసు బాధిస్తోంది. కాని తనుమాత్రం నీచమైన పని చెయ్యలేదు.

ఇంతలో దేశాన్నంతా వూగించేసే నాన్ కో-ఆపరేషన్ వొచ్చింది. దేశానికంతా ఆ దేశంపై ఆదేశం వస్తోంది. అందరికన్నా ముందు నారాయణప్పగారి మనసులో ఆ విషయాలు కలవరం కలిగించాయి. ఏదో తమ పొట్టకోసం పనితో పాటుబడేవాళ్ళకన్నా, తమ స్వంత పనిలేని వాళ్ళని ప్రతి వుద్యమం ముందుగా కదుపుతుంది. ఏమి దొరుకుతుందా కొంత హడావుడి చెయ్యడానికని వాళ్ళు చూస్తూ వుంటారు. ఏదో గోల లోకంలో జరుగుతూ వుంటేనేగాని వాళ్ళు బతకలేరు. దేశమంతా వాళ్ళ పనులు వాళ్ళు చూసుకునేవాళ్ళే అయితే ఇన్ని కాన్ఫరెన్సులూ, కాంగ్రెసులూ నిలబడతాయా? వెంటనే తన సూట్లూ, మల్లు పంచలూ మానేసి, ఖద్దరు కట్టడం మొదలు పెట్టాడు. ఇంటినిండా పంచమ జాతి నౌకర్లని పెట్టాడు. గోడలకి గాంధి పటాలు తగిలించాడు. మునపటి అందమే, షోకే, కాని ఇప్పుడు యూర్ఃకం. ఏ మీటింగులలో చూసినా అతనే! ఏ ప్రొసెషన్సులో చూసినా అతనే. ముందు గవర్నమెంటుని గురించి అతి తీవ్రంగా మాట్లాడతాడు. కొందరు గవర్నమెంటు నౌకర్లు భయపడి ఆయన ఇంటికి రావడం మానేశారు. కాని సులేమాన్ మానలేదు.

ఒకరోజు రాత్రి చీకట్లో నీళ్ళకుండి దగ్గిర సుశీలా, సులేమాన్ నించున్నారు. అమావాస్య చీకటి నక్షత్రాలు చుట్టూ కళ్ళులాగా మెరుస్తున్నాయి. తెల్లని పువ్వులుకూడా కనబడటంలేదు. వాళ్ళిద్దరూ రహస్యంగా మాట్లాడుకుంటున్నారు.

"నేనింక ఇక్కడికి రావడానికికూడా వీలుండకపోవచ్చును. నువ్వు వొచ్చి నాతో వుండిపోవాలి. నా నౌకిరిపోతే పోయిందిలే. కాని, నిన్ను వదలను. రావు! సుశీలా! రావాలి, తప్పదు."

"ఎట్లారాను! ఎట్లారాను! ఆయన్ని ఎట్లా వదలను? వీలులేదు"

"ఎందుకు వీలులేదు? వొచ్చెయ్యి నేనింక ఇక్కడికి రాను. ఇట్లా రావడం నాకు బాగుండలేదు. ఆయన మొహం చూడ్డానికే సిగ్గేస్తుంది. ఈ చీకట్లోంచి తప్పించుకుని బయటపడదాము."

"అయితే ఈ ఊళ్ళోనే మనమిద్దరమూ కలిసి వుండడం? నాకు ధైర్యం చాలుతుందో లేదో?"

"ఛా! అధైర్యపడతావా! ఏ విషయంలోనన్నా పడొచ్చుగాని భయపడి ప్రేమ జీవనాన్ని పోగొట్టుకుంటారా?"

"సరే ఆలోచిస్తా సంగతి నాలుగైదు రోజులు కానియ్యి తొందరేముంది?"

ఈ కొత్త ప్రేమ వచ్చిన తరవాత ఆ యింట్లో వుండడం అర్థహీనంగా కనబడుతోంది దేనికోసం తను అక్కడ వుండడం? కాని వెంటనే వెళ్ళటానికి ధైర్యం చాలడంలేదు. సులేమాన్ వెళ్ళిపోయిన తరవాత కూడా ఆ కుండువద్దున అట్లానే నుంచుని ఆలోచిస్తోంది. ఇంతసేపు నారాయణప్పగారు యింట్లోనే వున్నారు. వీళ్ళిద్దరూ యిక్కడున్న సంగతి ఆయనకి తెలుసు సులేమాన్ వెళ్ళిపోయిన బూట్సు చప్పుడు విన్న తరవాత చీకట్లో వెనకాలేవచ్చి సుశీల భుజంమీద చేయివేశాడు. చూడకుండానే వెనక్కి వంగి మెడమీద చేతులెయ్యడానికి వెతుకుతూ, సుశీల -

"మళ్ళీ యెందుకొచ్చావు?".... అంది మెడ కనబడలేదు. నారాయణప్పగారు సులేమాన్‌కంటె పొట్టి. వెనక్కి తిరిగి చూసింది. నారాయణప్పగారు కాగిలించుకున్నారు.

"నాతో చెప్పవూ? యిప్పుడన్నా చెప్పకూడదూ? యెందుకలా లోపల లోపల కుళ్ళుతావు? నాతో చెప్పేస్తే ఆ బాధ తప్పుకుండాపోతుంది. ఇన్నాళ్ళూ ఆనందంగా జీవించాము. ఇప్పుడు నీ హృదయమిలా వేరు చేసుకుంటావా? నామీద నమ్మకంలేదూ! చెప్పు"

"వొద్దు. వొద్దు నన్నడగకండి నేననుభవిస్తోంది చాలు. మిమ్మల్నీ కూడా యెందుకు బాధపెట్టడం? తెలియవలసినప్పుడు తెలియనే తెలుస్తుంది."

"అప్పుడు నీకు సహాయం చెయ్యగలనో లేదో. ఆలస్యంచేసి పాడుచేసుకుంటున్నావు. ఏదో మహాభ్రమలో నీకు అణుచుకోడానికి బలములేని వ్యామోహంలోపడి, క్షోభపడుతున్నావు. నన్ను నీకు సహాయం చెయ్యనీ, నా బలంకూడా నీకిస్తాను. నేనుకూడా నీతో కలిసి ఆలోచిస్తాను.... ఒక్క ఆత్మతో పెరిగామే. ఏం చేశానని నామీద నీకు నమ్మకం లేకపోవడం? పోనీ ఆలోచించు. ఎన్నాళ్ళయింది నువ్వు నాతో మనసిచ్చి మాట్లాడి? నామీద ప్రేమ పోయిందా నేను నిన్నేం ద్రోహం చేశాను?"

"మీరుకాదు, మీరుకాదు అంతా నేనే. నన్నాలా ముట్టుకోకండి. నేను పనికిరాను, తగను వెళ్ళండి - మీకే తెలుస్తుందంటున్నానుగా! వెళ్ళండి."

నారాణప్పగారు కొంచెంసేపూరికే వున్నారు ఇంక నిశ్చయం చేసుకొని అడిగేశారు.

"నేను నమ్మలేదు. ఇప్పటికే నాకు నమ్మకంలేదు. చాలా రోజులు అనుమానమే రాలేదు. నేను రానియ్యలేదు. కాని యిప్పుడనుమానంగానే వుంది. నిజం చెప్పుతావని నిన్ను అడిగేస్తున్నాను."

రెండు చేతులలో మొహం పెట్టుకుని ఆగట్టుకుని అనుకుని సుశీల యేడ్చింది.

"నాకు కోపమనుకోకు, విచారపడకలా. కాని యిలా సంగతులు జరగడం మాత్రం నాకిష్టంలేదు. నేను పనిచేసే పవిత్రమైన వుద్యమమేమిటి? నా యింట్లో జరిగే సంగతులేమిటి? మొదటినించీ యేం జరిగిందో చెప్పేస్తావా?"

"చెప్పను. చెప్పలేను."

"చెప్పితే చాలామంచిది. అందరిమల్లే నేను నిన్ను శిక్షంచడం కేకలువేయడం అవీ చేస్తానని అనుకోకు. సుశీలా, నీమీద ప్రేమ నాకింకా పోలేదు. అంతా మరచిపోయి పూర్వం మల్లేనే వుందాం చెప్పు."

"చెప్పను"

"అయితే పోనీలే ఇకముందు మానేస్తావా?"

"ఏమో చెప్పలేను. ప్రయత్నిస్తాను. నా శక్తికి మించిపోయింది గనకే లోబడ్డాను."

"అదేమైనాగాని, యీ ప్రకారం యిక్కడ జరగడం నాకిష్టంలేదు."

"సరే. ఆయన్ని యిక్కడికి రావద్దంటాను."

సుశీల ప్రతిరోజూ సాయంత్రం సులేమాన్ బంగళాకి వెళ్ళిరావడం మొదలుపె

ట్టింది. నారాయణప్పగారు గట్టిగా వీలులేదని పట్టుపట్టారు. యింక యీ పద్ధతి సాగదని తెలుసుకుని మూడురోజుల్లో అతనితో వుండటానికి వస్తున్నానని సులేమాన్‌తో చెప్పేసింది.

ఇవన్నీ జరుగుతుండగా ఈ లోపల నాన్‌కోపరేషన్ చాలా యెక్కువయింది. విద్యార్థులు బళ్ళు మానేస్తున్నారు. ప్లీడర్లు కోర్టులకి వెళ్ళడం లేదు. వార్తాపత్రికలు వుద్యమం దినదినమూ బలమవుతున్న సంగతి చాటుతున్నాయి. ఎవరికి చేత అయినట్లు వారు త్యాగం చేస్తున్నారు. ప్రతివారి హృదయాలలోనూ దేశభక్తి అంకురిస్తోంది. ధనం యిచ్చేవారు, సొమ్ములు యిచ్చేవారు, కాలమిచ్చేవారు, శక్తినిచ్చేవారు, సౌఖ్యాన్నిచ్చేవారు ఎవరికి చేత అయింది వారు అర్పించుకుంటున్నారు. ఏమౌతుందా అని ప్రతివారూ ఎదురు చూడ్డమే. 31వ - డిశంబరులో ఏదో గొప్ప మార్పు జరగబోతుందని ఆబాలగోపాలం నమ్మేశారు. అందులో ఆవూళ్ళో ముఖ్యంగా ఈ హడావుడి చాలా ఎక్కువగా వుంది. భజనలు, కీర్తనలు, మీటింగులు, ప్రొసెషన్‌లు, లెక్చర్లు, సమ్మెకట్లు, హర్తాళ్‌లు ఎగిరిపోతున్నాయి. వీటికంతా నాయకుడు నారాయణప్పగారు. యెప్పుడూ ఆయన యింటినిండా నాన్‌కోపరేషన్ మనుషులు. పొద్దుణ్ణించి సాయంత్రందాకా ఆ మాటలే, ఆ పనులే. కుర్చీలూ, సోఫాలూ మూలపారేశారు. చరకాలూ, మగ్గాలూ పెట్టారు!

సుశీలకి యిదేమీ అంటలేదు. ఆమె వూహలన్ని సులేమాన్ వూహలు. పూర్వమైతే నారాయణప్పగారితో ఈ సంగతులన్నీ చెప్పేపేది. కాని యిప్పుడు ఆయనతో సరిగానన్నా మాట్లాడ్డంలేదు. ఈ పనులన్నీకూడా వట్టి భేషజమనీ, నిరర్ధకమనీ, పనిలేనివాళ్ళూ, మూఢనమ్మకం కలవాళ్ళూ, దుర్మతాభిమానము కలవాళ్ళూ ప్రోత్సహించి చేస్తున్నారని సులేమాన్ చెప్పాడు. సుశీలకి కూడా అలానే కనపడ్డది. నారాయణప్పగారి గొప్పతనం, భావౌన్నత్యం, సుశీలకి తెలుసు. కాని ఆయనకి ప్రజలమీద వుండే అనురక్తి, ఆయన స్నేహితుల ప్రోత్సాహమూ, ఆయన్ని చెడగొట్టి ఈ ఉద్యమంలో చేర్చాయని ఆమె అభిప్రాయపడ్డది. కాని, జరిగే సంగతులని చూస్తున్న కొద్దీ తనూ, సులేమానూ, తక్కిన తమ స్నేహితులున్నూ తప్పు అభిప్రాయపడ్డారేమోనని ఆమెకి సందేహం కలగడం మొదలుపెట్టింది. నిజమైన త్యాగమూ, దీక్షా, సంతోషంగా కష్టపడ్డానికి సిద్ధము కావడమూ, యివన్నీ చూసి ఆమె కొత్తగా ఆలోచించుకోడానికి మొదలుపెట్టింది.

ఒకరోజు సాయంత్రం సులేమాన్ దగ్గిరనుంచి వచ్చేటప్పటికి యిల్లంతా గల్లంతుగా వుంది. వొచ్చేవాళ్ళూ, పోయేవాళ్ళూ, గుంపులు గుంపులుగాకూడి నారాయణప్పగారితో మాటాడేవాళ్ళునూ. అక్కడ ఎవరినో ఏమిటని అడిగింది. అతను ఆశ్చర్యపోయినాడు.

“మీకు తెలీనే లేదండీ? నారాయణప్పగారిని కోర్టుకు 20వ తారీఖున సమను చేశారు”

“ఎందుకు?”

“రాజద్రోహపు మాటలు మాట్లాడారనీ, ప్రజలని దౌర్జన్యానికి పురి కొల్పారనీ రోడ్లవెంబడి ఖద్దరు అమ్మారనీ”

“అయితే”

“అయితే ఇంకేముంది!ఈయన జామీనివ్వరుగదా! కఠిన. శిక్షవేస్తారు.”

సుశీల మేడ మెట్లెక్కి తన గదిలోకి పరికెత్తుకెళ్ళింది. ఖైదు. నారాయణప్పగారికి ఖైదు!తనతో చెప్పనేలేదు. ఎందుకు చెప్పాలి? ఆయన యెవరు, తనెవరు? పాపం ఆయన యీ గోలలు పడుతూవుంటే తను తన కేమక్కర్లేనట్లు సౌఖ్యపడాలని చూస్తోంది కదూ? ఆయన్ని మాత్రం ఎవరు సౌఖ్యపడొద్దన్నారు? ఈ ఖైదులోకి వెళ్ళడమెందుకు? ఆ మాటలన్నీ మాట్లాడమన్నదెవరు? పైగా జామీ నియ్యననడమెందుకు ఏమిలాభం ఈ పనులన్నీ పోనీ పూర్వమైతే పనిలేనివాళ్ళకి ఏదో పని అనుకోవచ్చు ఈ వుద్యమం కాని ఖైదులోకి పంపేటప్పుడు కూడా అదే పిచ్చా? అలానే కూచుని చాలాసేపు ఆలోచించింది.ఆయన జీవితం, తన జీవితం ఎంత వేరైనాయి. ఆయన్ని ఖైదులో పెట్టపోతుంటే తను ఇంట్లోంచి పారిపోవాలని చూస్తోంది కదూ?

మూడు రోజులు అదే పనిగా కూచుంది. ఎంగు ఇండియా చదవడమూ, చదివి తక్కినవాళ్ళతో మాట్లాడి, దేశస్థితీ ఈ వుద్యమము అవసరమూ, అర్థమూ గ్రహించింది. తన భర్తని న్యాయంగా సమను చేస్తున్నారనుకుంది. ఖద్దరు బట్టలు కొంది. తనకున్న బట్టలన్నీ పట్టుచీరెలతో సహా బైట రోడ్డుమీద తగలేసింది. ఖద్దరు బట్టలమ్మేవాళ్ళూ, లెక్చర్లు ఇచ్చేవాళ్ళూ, స్త్రీలున్నారని తెలిసి, వాళ్ళందరితో కలిసి సులేమాన్ బంగాళాకెళ్ళి అతన్నికొనమని అడిగింది. నవ్వి అదేదో జోక్ అనుకొని “యెన్ని కొనమంటావ్?” అనాడు. అన్నీ కొనమంది. కొనేశాడు. నవ్వుతున్నాడన్న మాటేగానీ, సుశీలలో మార్పుచూసి అతని మొహం వెలవెల పోతోంది. సుశీలకి జాలేసి సాయంత్రం వస్తానని చెప్పి వెళ్ళిపోయింది.

సాయంత్రం ఎప్పటిమల్లేనే వెళ్ళింది. నాన్-కో-ఆపరేషన్ గురించి ఇద్దరికీ చర్చ జరిగింది. ఈసారి సుశీల అతను చెప్పిందంతా వొప్పుకోలేదు. తను చేసేపని చేసి తీర్తానంది. నారాయణప్పగారి సంగతి ఏదో తేలిందాకా, సులేమాన్ దగ్గిర వుండిపోవడానికి రాననీ, వొచ్చి చూసిపోతూ వుంటాననీ వొప్పించింది.

సుశీల తన ఉద్యమంలో ప్రవేశించడం నారాయణప్పగారికి చాలా సంతోషం కలిగింది. ఇంక సులేమాన్‌తో సంబంధము మానుకుంటుందనికూడా అనుకున్నాడు. 29వ తారీఖున కోర్టువారు నారాయణప్పగారిని విచారించి వదిలేశారు. నారాయణప్పగారు స్పెషల్ కాన్ఫరెన్సుకి ఉత్తర ఇండియా వెళ్ళారు.

నారాయణప్పగారి పని కొంతభాగం సుశీలమీద పడ్డది. అదిగాక కొందరు నాయకుల్ని అరెస్టు చేశారు. ఆ భారమంతా కూడా సుశీలే పునుకుంది. పొద్దున్న లేచింది మొదలు సాయంత్రం వరకు యెడతెగని పని ఇప్పుడామెకి. వూరంతా ఆమెమీద ఎంతో భక్తి. ఆమెకీ, సులేమాన్‌కీ ఏదో సంబంధముందనే అనుమానము చాలామందికుందిగాని, ఆ గోలల్లో ఆలోచించడానికి ఎవరికీ తీరుబడిలేదు. సుశీలకి ప్రతిరోజూ సులేమాన్ దగ్గరికి వెళ్ళడానికి వీలయేది కాదు. బండి ఆపి లోపలికెళ్ళి అతన్ని చూసి “టైం లేదు. ఇవాళ్టికి వెళ్ళనియ్యి. రేపు వస్తా” అనేది. ఒక వారమయిం తరవాత ఒకసారి నాలుగు రోజులు అతనింటికి అసలే వెళ్ళలేదు. రోజు రోజూ సులేమాన్‌కి ఆమెమీద వెర్రిప్రేమ ఎక్కువై పోతోంది. బయట తిరిగి వ్యవహారాలు చక్కబెట్టుకునే నాయకురాలిని చూసేకొద్దీ అతనికి వొక విధమయిన పూజ్యభావమూ, భక్తీ యేర్పడుతున్నాయి. ఈ ఉత్సాహ ప్రవాహంలో పడి నీతినీ, మర్యాదనీ, బోధించే స్నేహితుల మాటలు విని, తనతో మాట్లాడ్డం మానేస్తుందేమో అని భయం ఎక్కువౌతోంది. అప్పటినించి అతనికి భరించరాని విరహావస్థ తటస్థమయింది. తనే ఆమె యింటికి వెళ్ళడం మొదటుపెట్టాడు. ఆమె యింటి దగ్గిర వుండేది కాదు. రాత్రి పదిగంటలదాకా కూచునేవాడు.

అప్పుడామె వొచ్చి భోజనం చేసి "నా సులేం ఏం చెయ్యను చెప్పు? నాకోసం కాచుకుని కూచున్నావా. రోజల్లా అలిసిపున్నాను. ఇప్పుడు నీతో కూచోడానికి కూడా వోపికలేదు. కళ్ళు కూరుకొస్తున్నాయి. పొద్దున్నే అయిదింటికే లేవాలి. యీవాల్టికివి చాలవూ?" అని పంపించేది. సులేమాన్ ఆమెని తన దగ్గరకొచ్చి వుండమని ప్రాణం తీసేవాడు.

"ఇంకొకడి పెళ్ళాన్ని తెచ్చుకోవడమే తప్పు. అందులో నాన్‌కోఆపరేషన్ దాన్ని తెచ్చుకుంటే, ఇంకా ఇబ్బందులు తటస్థిస్తాయి" అని నవ్వేది. అతనొప్పుకునేవాడు కాదు. ఆమె వస్తానన్న సంగతిని జ్ఞాపకం చేసేవాడు.

"మరి దేశమంతా యిట్లా గోలగోలగా వుంటే, అందరూ త్యాగం చేస్తూ వుంటే, అనేకమంది అన్నంలేక అల్లాడుతూ వుంటే, అనేకమంది స్త్రీల భర్తలు జైల్లోకి వెడుతూవుంటే, నేను వచ్చి నీతో సౌఖ్య మనుభవించనా? వచ్చినా నాకేమి మన స్థిమిత ముంటుందని? డిశంబరు 31వ తారీఖు అయిపోనీ, మాకు స్వరాజ్యమూ వొస్తుంది. నీకే పనీ వుడుతుంది. మన యిద్దరికీ పనే వుండదప్పుడు. బతికున్నన్నాళ్ళూ వొక్కనొకళ్ళం చూసుకుంటూ, ఎదురుగా కూచోవచ్చు."

నారాయణప్పగారు వొచ్చారు. సుశీల సులేమాన్‌కి కనపడ్డమే మానేసింది. పొరుగూళ్ళకి వెళ్ళేది ఖద్దరమ్మడానికి. సులేమాన్ ఆ వూళ్ళకికూడా వెళ్ళేవాడు. యెందరితోనో మొగవాళ్ళతో ఆడవాళ్ళతోనో వుంటే, ఆమె ఆవేపు వొచ్చిందాకా రోడ్డుమీద నుంచుని, తనని చూసి ఆమె చిరునవ్వు నవ్వితే ఎంతో గొప్పగా సంతోషించి, మోటారు సైకిలెక్కి వెనక్కి వొచ్చేసేవాడు. నాన్-కో-ఆపరేషన్ పార్టీ లెక్కడెక్కడ తిరుగుతున్నా సులేమాన్ హాజరు. సుశీల వూళ్ళో వున్నప్పుడు స్వరాజ్యాఫీసు గుమ్మంలో కావిలి. మొదట మొదట తమని కనిపెట్టడానికి వస్తున్నాడని అందరికీ కోపం వుండేది.

"పోలీసువాడు"

"గవర్నమెంటు బానిస"

"దేశద్రోహి"

"స్పై, స్పై"

ఇట్లా అనేవాళ్ళు. కొద్దిరోజులలో అతని సంగతి కనుక్కుని నవ్వుకునేవాళ్ళు.

సుశీల ఎప్పుడో వొకప్పుడు అతన్ని వొంటరిగా కలుసుకునేది.

"సులేమాన్; నీకేం కిలాఫత్తుమీద అభిమానం లేదూ?"

"ఎందుకు"

"నువ్వీ గవర్నమెంటు చాకిరీ యెందుకు మానవూ?"

"ఆ కిలాఫత్తు తగలబడనీ, నాకేం కావాలి? నాకు కావలసిందల్లా నువ్వు. నువ్వే నా మతం. నువ్వే నా కిలాఫత్. నువ్వే నా దేశం."

"నేను మానెయ్యమంటే మానేస్తావా యీ నౌకరీని?"

"ఈ నిమిషం కాయితం కలమూ తీసుకురా అదంతా ఎందుకు? నువ్వు ఇక్కడికి వొస్తేచాలు. ఇంక పని ప్రస్తావనే వుండదు. నేనూ నీ వెనక ఖద్దరు మూటలు మోసుకు తిరుగుతాను."

కాంగ్రెసునించి వచ్చిన పదిహేనురోజుల్లో నారాయణప్పగారిని అరెస్టు చేశారు. వూరంతా చాలా గోలయింది. మూడు వేలు జామీను యియ్యాలి. లేకపోతే మూడు నెలలు ఖైదు. మొదటినించీ నారాయణప్పగారి శ్వాసకోశాలు బలహీనమైనవి. ఈ వుద్యమంలో యెడతెరిపి లేకుండా పనిచెయ్యడంతో ఆయన చాలా బలహీనమయినారు. డాక్టరు ఖైదులోనికి వెళ్ళవద్దనీ, అపాయకరమనీ అన్నాడు. ఏ కారణంచేత తాను మానినా, దేశంలో తనమీద నింద పడుతుందని తెలుసు ఆయనకి. ఇన్నాళ్ళూ అందరినీ పురికొలిపి, చివరికి తాను సమయం వచ్చేటప్పటికి తప్పుకున్నట్లుంటుంది. అందువల్ల జామీనియ్యకుండా వుండడాని కాయనకి ధైర్యం చాలిందికాదు. నారాయణప్పగారిని జైలుకి పంపారు. అందరూ ఆ ఛార్జీ అన్యాయమన్నారు. సుశీలకే అట్లానే తోచింది. అన్యాయంగా ఆయన్ని శిక్షించినందుకు గవర్నమెంటుమీద చాలా కోపం వచ్చింది. నారాయణప్పగారిమీద జాలి కలిగింది. తనుకూడా ఆయన మాట్లాడిన మాటలే మీటింగులో మాట్లాడి తననికూడా అరెస్టు చెయ్యమని అడిగింది.

దినదినమూ సుశీలకీ, సులేమానుకీ ప్రేమ ఎక్కువవుతోంది? సుశీలకి పని ఎక్కువైనకొద్దీ, ఆటంకాలు ఎక్కువైనకొద్దీ, వాళ్ళకి వొకరినొకరు కలుసుకోవాలనే కోర్కెకూడా ఎక్కువవుతోంది. సులేమాను సుశీలని తనతో వుండిపొమ్మని అడుగుతున్నాడు. ఇంతలో డిశంబరు 31వ తారీఖు వచ్చింది; పోయింది.

"స్వరాజం పని ఇంక మానెయ్యి మరి; ఈ ప్రచారం, ఈ ముతక బట్టలూ" అన్నాడు సులేమాన్

"సులేమాన్! దేశంలోంచి వుద్యమం పోతే పోవచ్చుకాని, నా హృదయంలోంచి పోదు. దీనితో నా వూహలు, నా బతుకు, నా వాంఛలు అన్నీ మారిపోయినాయి. ఇదివరకటి మనిషిని కాను. ఈ వుద్యమం, ఈ త్యాగం అంతా వృధా కావచ్చు. దేశంలో యేమీ వుపయోగం లేకపోవచ్చు. కానీ ఒక జీవితానికన్నా గొప్ప వుపకారం జేసింది. కొత్త ఆదర్శాన్నీ, ఆనందాన్నీ, ఆసక్తినీ యిచ్చింది. నిజం చెబుతున్నా ఏమనుకోకేం. నీమీద ఎన్నటికీ పోని ప్రేమ వుంది నాకు. నన్ను మింగేస్తున్న ప్రేమ. నా దేహాన్నీ, ప్రాణాన్నీ, నీవి చేసిన ప్రేమ. అంతేకాని యిదివరకువలె నీ హోదా, నీ వుద్యోగం చూస్తే నాకేమి గౌరవంలేదు. ఇప్పుడు నా అభిప్రాయం అదంతా తిండికోసం బానిసత్వమని, ఆ యూనిఫారం చూస్తే నాకు పంజాబు, వధలూ, నిరాయుధుల్ని కాల్చడం జ్ఞాపకమొస్తాయి.... "

జైలులో నారాయణప్పగారికి జబ్బుగా వున్నట్లు తెలిసింది. సుశీలకి చాలా విచారంగా వుంది. ఆనాడు రాత్రి సుశీల తోటలో వొంటరిగా ఆలోచిస్తూ కూచుంది. తన భర్త జబ్బూ, జబ్బు చేస్తుందని ముందే తెలిసికూడా ఆయన వెర్రిగా జైలుకు వెళ్ళిన సంగతీ, వుద్యమం స్థితీ, తన ప్రేమా అన్నీ తలపుకు వొస్తున్నాయి. ఇంటిముందు మోటారు సైకిలాగింది, సులేమాన్ లోపలికొచ్చాడు. కూచుని సుశీల మెడచుట్టూ చెయ్యివేసి,

"దొరికావు చివరికి. ఎవరూ లేరేం?"

"తప్పించుకొచ్చేశాను"

"నాకోసమే? మరి అక్కడికి రాలేదేం?"

"కాదు. ఆలోచిస్తున్నాను."

"యేమిటి?"

"అంతానూ. ఈ వినోదమంతా"

"నాకు వినోదంగా లేదు చెప్పుమరి. మళ్ళీ నిన్ను విసికిస్తాగావును. కాని నాకిదే తలపు, ఆహారం, నిద్రా. సుశీలా! ఎన్నాళ్ళు చెప్పు ఇట్లా? ఎన్నటికీ రావూ?"

"సులేమాన్! ఒకమాట చెపుతా నీకు కోపం రాకూడదు. ఏమీ దాస్తున్నానను కోకు. నన్ను ప్రేమిస్తానంటున్నావా? నా హృదయాన్ని అర్థంచేసుకునే శక్తి యివ్వాలి నీకా ప్రేమ. లేకపోతే వృథా! నీమీద చెప్పలేని ప్రేమ నాకని నీకిదివరకే చెప్పాను. రోజు రోజూ అది యెక్కువవుతోంది. నాకిక్కడ ఒకనిమిషం కాలు నిలువడంలేదు.

అంతా నీ దగ్గిర వుండిపోవాలనే! నాకేం భయంలేదు. నాకి లోకమక్కర్లేదు. నువ్వు లేకుండా ఇంక నేను బతకడం వ్యర్థమని నాకు పూర్తిగా తెలుసు. కాని నారాయణప్పగారు జైలుకెళ్ళింది మొదలు నేను ఆ విధంగా నీతో సంతోషంగా వున్న నిమిషమల్లా నాకు సిగ్గేస్తోంది. అందులో విన్నావు కదూ, ఆయునకి జబ్బుగా కూడా వుందిట! ఆయన యీదేశం కోసం, నీకోసం, నాకోసం జైలుకి వెడితే ఆయన్ని వొదిలి ఆయన లేకుండా చూసి నేను నీతో సౌఖ్యమనుభవించనా? నన్ను చూడకముందు నారాయణప్పగారికీ, నాకు యెట్లాంటి ప్రేమవుండేదో నీకు తెలుసునా? నీ ప్రేమ వచ్చి నా జీవితం లోకి దాన్నంతనీ ఒక్కసారి కూలతోసింది. నాకు దిగులనుకోకు. పోయిన ప్రేమ కోసం నేను పశ్చాత్తాపపడటంలేదు. నీ పాదాల దగ్గిర కూచోగలిగితే చాలు ఆ పెద్ద చేతుల్లో ఊపిరాడకుండా బిగిసిపోయి చచ్చిపోవాలని వుంటుంది. కాని మన ప్రేమవల్ల ఆయనపడ్డ బాధ నువ్వెప్పుడన్నా తలుచుకున్నావా? ఆయన హృదయం యెట్లాంటిదో నీకు తెలీదు. నిన్ను బతిమాలుకుంటా, సులేమాన్! నారాయణప్పగారు వొచ్చిందాకా నన్ను ముట్టుకోవద్దు. ఆయన రాగానే ఆయనతో చెప్పి నీ దగ్గిరకి అసలు యెప్పటికి వచ్చేస్తాను సరేనా?"

"సరే. యింక నేననేదేమిటి? నీకు తెలుసు కదూ; ఈ పదిహేను రోజులు యెట్లా వుంటుందో నాకు! కాని నాకు భయంగా వుంది. సంగతులు చూస్తే మన ప్రేమకి ఏదో వొక ఆటంకం ఎప్పుడూ వచ్చేటట్టే వుంది. ఈ నాన్-కో-ఆపరేషన్ యిప్పుడే రావాలీ? అందులో ఎన్నడూ లేనిది ఆడవాళ్ళమీదకూడా భారమిప్పుడే పడాలి? సరే తక్కినవ్నీని. నిజంగా వొస్తావు కదూ? ఇంక ఏమీ అభ్యంతరం చెప్పకుండా ఎన్నాళ్ళుమట్టి యిట్లా దూరంగా వుంచుతున్నావు? కథలో రాజకన్య వ్రతమని వంకబెట్టి పోలిశెట్టిని దూరాన వుంచినట్టు అక్కడయితే ప్రేమలేదు యిక్కడో ......"

"ఇక్కడా? యిక్కడంతా నీదే! ఈ హృదయమంతా నీదే! సులేమాన్! నామీద ఇంకా సందేహమా! నీ సంగతి అట్లా వుంచు. నీ దగ్గిరకి రాక ఇంక నాకేముంది?....."

నారాయణప్పగారు జైలులో విడుదలై యింటికొచ్చారు. చాలా జబ్బుగా వున్నారు. డాక్టర్లు ఇదివరకే క్షయరోగపు చిహ్నాలు న్నారు. ఇప్పుడు బాగా పరీక్షచేసి అది క్షయరోగమేననీ, జైలులో పట్టుకుందనీ, కుదరడం చాలా కష్టమనీ మదనపల్లి మొదలైన స్థలాలలో వుంచితే రోగి చచ్చిపోడుగాని, బతికున్నన్నాళ్ళూ మంచంమీద నించి లేవడనీ చెప్పారు.

మూడు రోజులయింది. సాయంత్రం అయిపోయి మెల్లిగా చీకటవుతోంది. సులేమాను తన బంగళాగదిలో బల్లముందు కూచుని, అవసరమైన కాగితాలు చూస్తున్నాడు. చేతిలో సిగరెట్టుంది. బల్లమీద పెద్ద టేబిలు లైటు వెలుగుతోంది. సుశీలవచ్చి గుమ్మం దగ్గిర నుంచుంది. సులేమాను చివాలున లేచి పరుగెత్తుకుని గుమ్మం దగ్గిర కెళ్ళాడు.

"సుశీలా! వొచ్చావా చివరికి?"

"నువ్వు నన్ను ముట్టుకోకుండా దూరంగా కూచుంటేనేగాని నేను లోపలికి రాను."

"యేమిటి?"

"చెబుతాను. ముందు అట్లా కూచో"

సుశీల కంఠం కన్నీళ్ళలో వొణుకుతోంది. ఇముడ్చుకోలేని ఆవేశాలు ఆమెని కదలించేస్తున్నాయి. తెల్లబోయిన మొహంతో కుర్చీలో కూచుని, సులేమాను సుశీలవేపు వొంగాడు. సుశీల కూచుంది. ఇద్దరి మొహాలమీదా వెలుతురు పడుతోంది. సులేమాను చేతిలోంచి సిగరెట్టు జారి కింద పడ్డది. వొణుకుతున్న వేళ్ళతో ఇంకొకటి వెలిగించుకున్నాడు. సుశీల బల్లమీద చేతులు వేసి, తలానించి ఏడుస్తోంది. సులేమాను చూడలేకపోయినా లేచివొచ్చి ఆమె తలమీద చెయ్యివేసి "సుశీలా...." అన్నాడు. సుశీల లేచి,

"అట్లా కూచో, యీడవను చెపుతా..... నేనింక ఇక్కడికి రాను. నీకు తెలిసింది కదూ? నారాయణప్పగారి స్థితి; ఆయన్నెవరు చూస్తారు? నేను కాకపోతే యింక దిక్కెవ్వరు?"సులేమాను ఆలోచించాడు.

"అతనికి తమ్ముళ్ళెవరో వుండాలి కాదూ?"

"వుంటేమాత్రం వాళ్ళు నేను చూసినట్లు చూస్తారా? ఇన్నాళ్లూ వాళ్ల సంబంధం లేకుండా అవసరం వొచ్చేటప్పటికి వాళ్ళమీద పడెయ్యనా? యెట్లావుంటుంది ఆలోచించుకో. యెవళ్ళున్నా ఆయన్ని జాగర్త తీసుకున్నా ఆయన్ని వొదిలి నేను సంతోషంగా వుండనా? నాకొస్తే ఆయన చేసేవారుకారూ? నేనంత హృదయం లేనిదాన్నయితే నీకు నన్ను చూస్తే గౌరవమేముంటుంది. నీకే యిట్లాంటి జబ్బుచేస్తే, వొదిలేస్తే?"

"సరేలే అనుకున్నట్టే అయింది. అతను నిన్ను తనకి కట్టేసుకోడానికి యీ జబ్బు తెచ్చుకున్నట్టుంది. పోనీ నేనే వొస్తూ వుంటాలే. వీలున్నప్పుడే వొస్తోవుండు ఏం చెయ్యను?"

"ఆలోచించి అన్ని సంగతులు చెబుతాను. నాకీ దెబ్బతో మతిపోయినట్టుంది. ఇటు నీ ప్రేమా, అటు కర్తవ్యం; నా ప్రాణాలు చీలుస్తున్నాయి....."

సుశీల మళ్ళీ సులేమానుకి కనపడ లేదు. వారంరోజుల్లో నారాయణప్పగారిని తీసుకుని మదనపల్లి వెళ్ళిపోయింది. సులేమాను రెండునెల్లు చూశాడు, జవాబులేదు. చివరికి తనే వెళ్ళాడు. పొద్దున్నే తొమ్మిదింటికి వాళ్ళున్న వార్డు దగ్గిరికి చేరుకున్నాడు. మంచం పక్కన గుడ్డ కుర్చీలో సుశీల చదువుకుంటో కూచునివుంది. వెనక బల్లమీద మందుబుడ్లూ అవీ వున్నాయి. ఆమెని చూసేప్పటికి అతని కాళ్లు వొణికాయి. కళ్ళవెంబడి నీళ్ళొచ్చాయి. ప్రేమంతా వొక్కసారి తిరగపెట్టింది. అట్లానే అక్కడ నించుని పోయినాడు. నారాయణప్పగారు కొంచంగా కదిలారు. సుశీల పుస్తక పక్కడపెట్టి, లేచి, దగ్గిరకివెళ్ళి దిళ్ళు సరిగా పెట్టింది. రోగంతో బాధపడుతున్న చంటిపిల్లని అత్యంత ప్రేమగల తల్లికూడా అంత శ్రద్ధతో చూసివుండదు. ఆమె కళ్ళల్లోంచి ప్రేమా, దయా వొలికిపోతున్నాయి. సులేమానుకి సిగ్గేసింది. వెనకాలకి తిరిగి పోవాలనిపించింది. సంపూర్ణమైన నిరాశ కలిగింది. ఈ ప్రయాస అంతా వ్యర్థమని తెలిసింది. సుశీలతో వొక్కమాట మాట్లాడకుండా వెళ్లడమెట్లా? దగ్గిరకి నడిచాడు. ఆమె కళ్ళెత్తి చూసి మెల్లిగా చప్పుడుకాకుండా వొచ్చింది రహస్యంగా.

"దూరంగారా రాత్రంతా నిద్రలేదు. ఇప్పుడే కళ్ళు మూశారు" అంది. దూరంగా వెళ్ళిన తరువాత "యెందుకొచ్చావు?" అని అడిగింది.

"ఎందుకు! యెక్కడ నిలుస్తుంది నా ప్రాణం?"

సుశీల కళ్ళవెంబడి నీళ్ళుకారాయి.

"పాపం! ప్రతి నిమిషం నీ సంగతే తలుచుకుంటాను. నిన్నెంత కష్టపెడుతున్నాను? నేను లేకుండా నువ్వెట్లా వుంటావో నాకు తెలుసు. నిన్ను ......"

"నాతో చెప్పకుండా వచ్చేశావు కదూ?"

"యేం లాభం, మళ్ళీ నిన్ను చూస్తే నా మనోబలమంతా మాయమవుతుందని

భయమేసింది. చెయ్యికూడదనుకున్నది. యేదో వొకటి చేస్తాను అందుకని......."

"పోనీలే...... ఆలోచించి చెపుతానన్నావు......"

"సులేం! నన్ను మరిచపోలేవూ? పెళ్ళి చేసుకో నామాట విను. ఇట్లా యెన్నాళ్ళుంటావూ?"

"ఇదా నువ్వు చెప్పేది? ఎట్లా మరచిపోను? యెక్కడున్నా నీ రూపమే కనబడుతుంది. నీ కంఠమే వినబడుతుంది. నీ పనులే జ్ఞాపకమొస్తాయి."

"ఏం చెయ్యను? అట్లా చూడు వదిలిపెట్టి రమ్మనడానికి నీకు నోరొస్తుందా?"

"వద్దు, నేను నా పని మానేసి ఇక్కడే వుంటాను. వుణ్నెయ్యి"

"కాని యిదివరకు రకంగా వుండను. సులేం అంతా ఆలోచించా"

"ఏం? నామీద ప్రేమ లేదా?"

"వుంది. చాలా వుంది. కాని ఆయన మీద అపరిమితమైన ప్రేమ వచ్చింది. ఏదో జాలికాదు. నిజంగా ప్రేమ. అట్లా చూస్తావేం? ఆశ్చర్యంగా వుందా? ఆ బొమికల కుప్పమీద ప్రేమ యేమిటనిపిస్తోందా నీకు? అవును. అట్లాంటి ప్రేమకాదు, నీమీద ప్రేమ రకంకాదు. ఆ పాదాల దుమ్ము నెత్తిన వేసుకోడానికి తగననే భక్తికూడిన ప్రేమ. నా దేశం కోసం, నా ప్రజలకోసం, అట్లా అయినారు: తన ఆరోగ్యాన్నర్పించారు. నువ్వనుకోడం ఆ త్యాగమంతా నిరుపయోగమని! పిచ్చే అనుకో. అయినా వ్యర్థమయినదానికియే మాత్రమూ జయము ఆశలేని దాని కోసం, అంత త్యాగం చేశారు. తెలిసి వొద్దని డాక్టరులంటున్నా చేతులారా తెచ్చుకున్నారు. ఆ మహాగౌరవంలో నా ఆత్మే ఆయనదయింది. ఈ శరీరం, ఈ మనస్సు, శక్తే అన్నీ ఆయనవే! వాటిల్లో ఇంకొకళ్ళకి భాగం ఇవ్వడానికి వీల్లేదు, నీకుకూడా. క్షమించు! మనమిద్దరం కూడా ఆ కాళ్ళని తలమీద ఆనించుకోడానికి పనికిరాము."

"నా సంగతేమిటి సుశీలా? యింక......."

"నన్ను క్షమించు. వెయ్యిసార్లు క్షమించు, నాకెంత విచారంగా వుందో నీకు తెలీదు. నీ హృదయాన్ని లాక్కుని, నిన్నిట్లా యేడిపించడం నన్నెంత విచార పెడుతుందో? ఏం చెయ్యను? అట్లా కాకుండా ఇంకెట్లానయినా నీ సేవ చేయగలిగితే నీ దుఃఖం పోగొట్టగలిగితే......"

"సుశీలా యిదంతా నువ్వు తెచ్చిపెట్టుకుంటున్నావు. ఆయన యేదో మహా త్యాగం చేశారనీ, గొప్ప అపాయంలో వున్నారనీ....."

"సులేమాన్! నీ కర్థంగాదు ఆయన సేవకి ఈ చేతులు నిర్మలంగా వుంచకపోతినే అని నాకెంత బాధగా వుందో ఏం చెప్పను?

ఇంక ఆశపడకు. వుత్తరాలు రాయక, నువ్విక్కడికి వొచ్చీ, యేం ప్రయోజనం లేదు. వెళ్ళు. వెళ్ళమనడానికి నోరురాదు. కాని యేం చెయ్యను?"

"సుశీలా....."

"వెళ్ళు నీకు నమస్కారం చేస్తా. నా నిశ్చయాన్ని చెడగొట్టడానికి చూడకు. చెడదు. అన్నాళ్ళూ నిజంగా నిన్ను హృదయపూర్వకంగా ప్రేమించా. యెంతో ఆనంద మనుభవించా అయితే---"

"ఆయన వొకవేళ పోతే?"

"అనకు. ఆమాట అనకు. అది తలవనుకూడా తలవను. నాకు చాలా కష్టంగా వుంటుంది. ఆయన లేకపోతే నేనుంటానా?......"

దూరంగా సులేమాను కొండదిగి వెడుతున్నాడు. సుశీల మంచం దగ్గర కుర్చీలో చప్పుడుకాకుండా యేడుస్తోంది. వెనకాల ఆమె వీపుమీద నారాయణప్పగారు చెయ్యేశారు.

"సుశీలా! చూస్తూనే వున్నా; యెట్లా వుంటావు? వెళ్ళు నీకానందం అక్కర్లేదూ?"

"ఆ సంగతి మాట్లాడకండి, అదంతా అయిపోయిది."

"నిజంగానే? నీకు దిగులు లేదూ?"

"ఉంది. అతను నాకోసం పడే బాధకోసం దిగులేస్తోంది."

"నీ కోసమో?"

"నా కోసము నాకేమి దిగులు లేదు. నేనే పవిత్రురాలినై, మీ సేవ చెయ్యడానికి తగివుంటే ఎంత బాగుండేది అనే దిగులుతప్ప ఇంకేమీలేదు. మీ దగ్గిరుండడం, మీ సేవ చెయ్యడం, నాకు స్వర్గతుల్యంగా వుంది. ఎవరికి లభిస్తుంది ఇట్లాంటి అదృష్టం? నావంటి దాన్ని మీ సేవకి అంగీకరించినందుకు నాకు ఎంతో......"

"నిజం!"

"నిజం, నేను జరిగిందానికి ఏడ్చాను. అంతే"

*

# మెట్లు దిగే నగ్న సుందరి

బొటనవేలు మీద మరొకటి, కురిసే హిమశరీరంలా
పండు నిమ్మ బంగారంలా, వేరూ, తోలూ
సూర్యకాంతిలో చెరుగుతుందామె మెట్ల కిందకి పోతూ
వొంటిమీద ఏమీ లేకుండా, లేదేమీ మనసులో

దాగి చూస్తాం మనం మెట్లకింద
అంతం లేని ఆ తోపిడి, తొడమీద తొడ
ముద్ర వేస్తాయి ఆమె పెదవులు, వూగిసలాడే గాలుల్లో
విడిపోతాయి వీలుగా ఆమె శరీరభాగాలు

ఏకవనితా జలపాతాన్ని ధరిస్తుందామే
మెల్లగా దిగుతున్న ఆమె, సుదీర్ఘ వస్త్రవిశేషంలా
సాలోచనతో ఆగుతూ చివరి మెట్టు మీద
పోగు చేస్తుంది ఆమె తన కదలికలను ఓ రూపంలా

--ఎక్స్.జె. కెన్నెడీ

తెలుగు: కె. సదాశివరావు

MARCEL DUCHAMP పెయింటింగ్
NUDE DESCENDING A STAIRCASE మీద కవిత